# పురుష లక్షణం

తోట వెంకటాద్రి

జానకి: యేం గోపాలంగారూ యిక్కడ కూర్చున్నారు?

గోపాలం: యేం లేదు. ముందు నీ సంచిలో యేముందో చెప్పు.

జా: యెందుకు? ఓ చిన్న మిఠాయి పొట్లం ఉంది.

గో: మిఠాయి పొట్లమా! అయితే యిలా యిచ్చేయి నాకు.

జా: (సంచిలోంచి మిఠాయి పొట్లం తీసి యిస్తుంది.)

గో: (తీసుకుని) యే అమ్మో! యిలారా! (అంటూ అతనికి కొంచెం దూరంలో కూర్చుని ఉన్న వృద్ధురాలైన ఓ ముస్లిం భిక్షుకిని పిల్చి ఆ మిఠాయి పొట్లం యిచ్చేస్తాడు.) జానకీ! చూశావా పాపమీ స్త్రీని?

జా: చూశాను. అయితే యీ గోరీల దొడ్డిగోడమీద కూర్చుని యేంచేస్తున్నారు మీరు?

గో: నేను సికింద్రాబాదునుండి నడిచొస్తున్నాను. కాళ్ళు పీకుతున్నై. కొంచెం సేపు విశ్రాంతి తీసుకుందామని, యీ చింతచెట్టు చల్లని, చిక్కని నీడలో, యీ పిట్టగోడమీద కూర్చున్నాను. యిలా కూర్చున్నానో లేదో, పాపమా బిచ్చగత్తెవచ్చి, 'యేక్ పైసా బా!' అంటూ అతిదీనంగా చెయిచాచింది. పొద్దున యింట్లో శారద పచ్చిమిరపకాయల కోసం చేసిన హెచ్చరిక తటాలున జ్ఞాపకం వచ్చి, పైసా ఉంటే పచ్చిమిరపకాయలు కొని యింటికి పట్టుకెళ్ళక పొయ్యానా, సీదాకొచ్చేదా అని మనస్సులో అనుకొని ఆ బిచ్చగత్తెతో లేదు పొమ్మన్నాను. అసలు నాదగ్గర డబ్బులుంటే సికింద్రాబాదునుంచి నడిచొచ్చేగతెందుకు బడుతుంది? యింతలోనువ్వొచ్చావు.

జా: బాగుంది. నా మిఠాయి పొట్లం ద్వారా మీ వితరణ గుణాన్ని చాటుకున్నారన్న మాట. లేవండి పోదాం, యింటికి రారూ?

గో: పోదాం, వస్తా. కాని జానకీ! కష్టదశలోనున్న మనిషిని చూస్తే, జాలి, కనికరం, దయ యిత్యాదులు నాకు వాటంతటవే పుట్టుకొస్తాయి. అయితే యేం చేయగలం? చేతగాని దయాదాక్షిణ్యాలవల్ల కలిగే ప్రయోజనం యేమిటి? బాధపడుతున్న వ్యక్తి బాధ తీర్చలేని దయాదాక్షిణ్యాలు కలిగిన వ్యక్తి, ఆ బాధపడేవాడికంటే, యెక్కువ బాధపడతాడు జానకీ!

జా: బాగా చెప్పారు.

గో: అంతలోనూ చూశావ్! ఆమె చాలా వృద్ధురాలు. పనీబాటా చేసుకోలేని స్థితిలో ఉంది. కాబట్టి...

జా: ఆమెకు పరదాగూడా ఉందే!

గో: ఉంది. అదే నాకు చాలా బాధాకరంగా ఉంది జానకీ. ఓ వృద్ధ భిక్షుకి సహితం పరదా వేసుకోందే అడుక్కోలేదు. పరదా అంటే యింత అభిమానం యెందుకో నా కర్థం గావడంలేదు. పురుషుడు స్త్రీమీద పెత్తనం సంపాదించిం తర్వాత, ఆమెకు చేసిన అన్యాయాల్లో యీ పరదా విధింపు. క్రూరాతిక్రూరమయింది, ఘోరాతి ఘోరమయింది. యేమంటావు?

జా: నిజమే కావచ్చు.

గో: కావచ్చేమిటి? ముమ్మాటికీ నిజం. ప్రకృతి ప్రసాదితాలైన గాలి వెలుతురుగూడా స్వేచ్ఛగా అనుభవించడానికి స్త్రీ నోచుకోలేకపోతుందంటే, నిజంగా యెంత ఘోరమో యిది ఊహించు. ఈ పరదా ధరించడం అలవాటు చేసుకోవడంవల్ల అనేక వ్యాధులు సంభవిస్తాయి జానకీ!

జా: మునుపు పాకిస్తాన్‌నుంచి ఓ పాత్రికేయి యిండియాకు పరదాలోనే వచ్చిందట. పరదాల్లోనే సభలకూ సమావేశాలకూ హాజరయ్యేదట.

గో: అవును. పాత కొత్తల మేలు కలయిక అంటే యిదేరా అంటూ ఓ మిత్రుడన్నట్లు గూడా నాకు జ్ఞాపకమే. మీరంతా ఆ విజ్ఞానవతిని ఆదర్శంగా పెట్టుకుంటే యిహ అడగవలసిన పనేలేదు. నువ్వుగూడా రేపటినుంచి ఓ బురఖా తగిలించుకొని బడికి వెళ్లుతూఉండు.

జా: అదిగాదండీ! పరదా ధారిణులకు గూడా ప్రత్యేక పాఠశాలల్లో విద్య నేర్పుతున్నారు గదా!

గో: ఆ విషయం నాకుగూడా తెలుసు. పరదా తీసివేసి యెందుకు చదువుకోగూడదూ? సరే! శ్రీమంతురాలయిన ఓ స్త్రీ పరదాలోనే పెద్ద విజ్ఞానం సంపాదించిందనుకో. ఆ విజ్ఞానం వల్ల ఆమె బయటకొచ్చి, సమాజానికీ, ముఖ్యంగా స్త్రీజాతికీ చేసేసేవ యేమిటి? తిరిగి పరదాలోకే ప్రవేశంగదా? ఆమె కష్టపడి సంపాదించిన విజ్ఞానం అంతా బూడిదలో పోసిన పన్నీరు చందంగాదా? ఆమె ఓ "పవన కుంభితచర్మ భస్త్రి" కన్నా యెక్కువేమీ కాదు. సాధారణంగా తన విజ్ఞానాన్ని సమాజాభ్యుదయాని కుపయోగించని ప్రతి విజ్ఞాని శరీరంగూడా అంతేననుకో. ఏమంటావు?

జా: ఒకవేళ అటువంటి స్త్రీకి అభ్యుదయ భావాలు కలిగినప్పటికీ పురుషులు ఒప్పుకోవద్దా?

గో: అదే నేననేది. విద్యావంతులు, విజ్ఞానవేత్తలూ అనిపించుకుంటున్న పురుషులు సహితం స్త్రీలను బయటకు రాకుండా నొక్కిపెడుతున్నారు. గృహలక్ష్మిని, గృహరాణిని చేసి సంతృప్తిపడుతున్నారు. ఆ మాతృస్వామిక వ్యవస్థలో యేం సుఖించారో స్త్రీలు! అంతే. నాటినుంచి నేటివరకు స్త్రీ పురుషుడికి ఓ బానిసగా, ఓ బరువుగా తయారయింది. కేవలం పిల్లలను కనే యంత్రంగాను, పురుషుడు తన యిచ్చవచ్చినట్లు తన అవసరాలను తీర్చుకొనే ఓ వస్తువుగాను మారింది. స్త్రీ తన పోషణకు పురుషుడిమీద ఆధారపడి సోమరిపోతయింది. చూశావు జానకీ! మరీ యీ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆడది యెంత అధోగతి పాలయిందో! పెట్టుబడిదారీ వ్యవస్థలో పురుషుడే ఓ బానిసైతే, ఆ బానిసకు బానిసగా తయారయింది నేటి స్త్రీ అంటూ బెర్నార్డ్‌షా అంటున్నాడు.

జా: మా దురదృష్టమా అన్నట్లు, హిందూకోడు బిల్లు గూడా వెనక్కు పోయిందిగా గోపాలంగారూ! అభ్యుదయ కాముకులైన మన నాయకులే యిలా చేస్తారని అనుకోలేదు.

గో: అవును. అభ్యుదయ కాముకులనిపించుకొంటున్న యీ నాయకులే, స్త్రీ శక్తి స్వరూపిణి అనీ, మాతృదేవత అనీ యమహాబులు కొడుతూంటారు. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే ఆమె పైకిరావడం తటస్థిస్తుందని నొక్కివక్కాణిస్తుంటారు. అయితే మన, నాయకులు వత్తి వాగుడు దప్పితే క్రియ శూన్యం జానకీ. యెప్పటికైనా స్త్రీ సామాన్యం తీవ్రాందోళన జరపందే లాభంలేదు. సరే పోదాం పద, మా యింట్లోనన్నా యింత ఫలహారం చేద్దువుగాని. నిష్కారణంగా నీ మిఠాయి పొట్లం నా మూలాన...

జా: ఫరవాలేదు పదండి.

(గోపాలం లేస్తాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ యింటికొస్తారు. గోపాలం యిల్లు తాళం వేసి ఉంటుంది)

జా: శారద యెటో వెళ్ళిందిలావుందే!

గో: నాకు తెలియదూ? నే ననుకున్నట్లే అయింది. మంచిది. (అని పక్కయింటికెళ్లి విచారించి వస్తాడు భార్య యెక్కడికి వెళ్ళిందోనని.)

జా: యెక్కడికెళ్ళిందండీ శారద?

గో: మీటింగట మీటింగు!

జా: యేమ్మీటింగేమిటి? తాళం చెవన్నా యిచ్చి వెళ్ళిందా?

గో: ఆ! యిచ్చే వెళ్ళింది నా గతి నన్ను చూచుకోమని. (అంటూ తాళం తీస్తాడు. యిద్దరూ లోపలకు వస్తారు) ప్రసూతి, శిశు సంరక్షణను గురించి శిశుసంరక్షణాలయంలో ఓ డాక్టరమ్మ ఉపన్యాసం యిస్తుందట. ఆ వుపన్యాసం వినడానికి యీమె వెళ్ళిందట.

జా: ఆదేమిటి, పక్క యింటివారు వెళు తుంటే వారివెంట వెళ్ళిందేమో లెండి.

గో: పక్కయింటివారు యెన్నిపాట్లయినా పడతారు. వారికేం భాగ్యవంతులు! మరీ ఆ శ్రమీల ఉండే అబ్బో మహా మిడిసిపడుతుంది. ఆమె చూడని సినిమా లేదు, హాజరుగాని మీటింగులేదు, వినని వార్త లేదు. వాళ్లెక్కడ వూరేగితే మనకెందుకు? యీ మేమన్నా గర్భిణీ స్త్రీ అనా, పిల్లల్ను గన్నదనా! మీటింగుకెళ్ళి యేం నేర్చుకుంటుందిచెప్పు. నిన్నగాక మొన్న కాపరానికొచ్చిందో లేదో, యింత చనువా, యింత స్వేచ్ఛా, యింత స్వాతంత్ర్యమా. చెప్ప కుండా బయటకుపోవడమేనా? అయ్యో భర్తే! (అంటే జానకీ, భరించువాడని అర్థం) యెక్క డికో వెళ్ళాడో! యింటికి రాంగానే యింత కాఫీచేసి యివ్వాలన్న ధ్యాస ఉండ క్కర్లా? పతిభక్తి కించిత్తయినా ఉందంటావా శారదాదేవికి? నిజంగా మన పూర్వులు పెట్టిన పద్ధతులు యెంతో మంచివి జానకీ! "పతి హిత భక్తిచే వెలయు పద్మదళ ప్రతిమాన నేత్రకున్ వ్రతముల సాదలేమిటికి?" అన్న దాంట్లో ఎంత అర్థం ఉందో గ్రహించు. యేమంటావ్?

జా: (విస్తుపోయి) నాకయోమయంగావుంది.

గో: ఉంటుంది. ఉండదూమరీ? ఆ అప్పా రావు ముండాకొడుకు యిదుగో యిస్తానని, నాలుగు నెలలయింది నాదగ్గర పది రూపా యలు అప్పు తీసుకుని. యింతవరకు అతీ గతీ లేదు. వాడికోసం చచ్చేటట్లు సికింద్రాబాదు వెళ్ళేసరికి, యింట్లో తగలబడి లేడు. ఉన్నా లేడని చెప్పించే రకం వాడు. మళ్ళీ అక్కడి నుంచి నడిచొచ్చేసరికి యెట్లా ఉంటుందో చెప్పు. సాయంత్రం ఉప్మా చేస్తానన్నది. ఉప్మా లేదూ దాని పాడూ లేదు. తలుపు తాళంవేసి మీటింగుకు పోతుంది! రానీ ఒళ్లు హూనం చేసేస్తా.

జా: ఇదేమిటి మీకేదో పిచ్చెక్కింది. నేను చేసి పెడతానుండండి ఉప్మా మీకు.

గో: అక్కర్లేదు. నిజంగా చూశావ్ జానకీ! న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి అన్న మహానుభావుడికి చేయెత్తి దండం పెట్టొచ్చు. లేకపోతే యింతే వ్యవహారం. స్త్రీ బాల్యంలో తలిదండ్రులమీదా, యౌవనంలో భర్తమీద వృద్ధాప్యంలో తన సంతానంమీదా ఆధారపడి ఉండాలి అన్న సుభాషితంలో యెంతో సత్యం యిమిడి ఉంది. అవన్నీ అనుభవంమీద చెప్పిన మాటలు జానకీ! హిందూకోడు బిల్లు వెనక్కు నెట్టారంటే, వాళ్ళేం దద్దమ్మలై అట్లాచేయలా. ముందు, వెనుకా బాగా ఆలోచించే చేశారా పని, నిజంగా మేధావులంటే వాళ్ళేననుకో. స్త్రీలకు ఆర్థిక స్వాతంత్రమే ఉన్నట్లయితే, అమ్మో చెప్పినమాట వింటారనేది కలలోని వార్త. స్త్రీకి బురఖా వేశారూ అంటే మనకు తెలియని కారణాలు అనేకం ఉండి ఉంటై అనడంలో అబద్ధం లేదు. ఆశ్చర్యం లేదు.

జా: చాల్లెండి, ఊరుకోండిహ.

గోపా: ఇంకా రాలేదు చూశావా! యిల్లే మయిందో. మొగడేమైపోయినాడో అన్న భయం, భక్తీ ఉన్న మనిషైతే యింతసేపూ యేం చేస్తుంటుంది ఆ వెధవ మీటింగులో కూర్చొని! ప్రసూతి, శిశుసంరక్షణను గూర్చి నన్నడిగితే నేం చెప్పకపోయానా? రానీ చెప్తా.

జా: కొంచెం ఓపిక పట్టండి. పాలున్నయి గదూ కాఫీ పెడతా.

గో: పాలున్నయి, పచ్చిమిరపకాయలున్నై ఆబుట్టలో. ముందు కొంచెం మంచినీళ్ళిట్లా యివ్వు, దాహం మహా అవుతూంది.

జా: సరే! ఉప్మా గూడా చేస్తానుండండి అంతలో శారద గూడా...

గో: విశారదై వస్తుందంటావా (అంటూ జానకి యిచ్చిన మంచినీళ్లు త్రాగి కూర్చుం టాడు. జానకి కుంపటి వెలిగిస్తుంది.)

మనం పొరుగువాళ్ళ కష్టనిష్టూరాలను ఓపికతో వినడానికి కారణం సమయం వచ్చినపుడు వాళ్లుకూడా మనవి వినకపోరనే ఆశ.